క్లుప్తంగా

ఘనంగా మాలధారుల ఇరుముడి మహోత్సవం



ఇరుముడి మహోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

మఠంపల్లి : మండలంలోని తుమ్మలతండాలో సోమవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడులు ధరించి శబరి యాత్రకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఎస్పీపై తప్పుడు ప్రచారం చేస్తే సహించం

కోదాడ : కోదాడ నియోజకవర్గంలో బలంగా ఉన్న బీఎస్పీని ఎదుర్కొనే శక్తిలేక ప్రత్యర్థి పార్టీలు తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, తప్పుడు ప్రచారం చేస్తే సహించడమని కోదాడ బీఎస్పీ అభ్యర్థి పిల్లుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం కోదాడలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుజనుల్లో తమ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని, దీంతో అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు కంగారు పడి తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. కోదాడ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్న తమపై తప్పుడు ప్రచారం చేయడం ఆ పార్టీల దివాళకోరుతనాన్ని సూచిస్తుందన్నారు. సూర్యాపేటలో బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్యపై అధికార పార్టీ నేతలు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సమావేశంలో కాంపాటి శ్రావణ్, ఎరసాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలుడు మృతి



బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారంలో అనారోగ్యానికి గురై బాలుడు మృతి చెందాడు. గ్రామానికి భారతం రాజు కుమారుడు హర్షప్రణవ్(14) చిలుకూరు మండలంలోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కాగా, ఇటీవల అనారోగ్యానికి గురైన బాలుడు సోమవారం మృతి చెందాడు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బాలుడి తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, సారెడ్డి భాస్కర్‌రెడ్డి, సైదిరెడ్డి, హరితీలబ్రహ్మరెడ్డి తదితరులు ఉన్నారు.

అన్నదానం నిర్వహించడం అభినందనీయం



కోదాడరూరల్ : అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ రాము

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు సోమవారం నుంచి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి పట్టణ సీఐ టి.రాము హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా మాలధారులకు అన్నదానం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాసు నాయుడు, బర్మావత్ సీతారాంసింగ్, గడ్డం సూర్యారెడ్డి, రంగా, మాలధారులు ఉన్నారు.

మాలధారులకు అన్నదానం

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో మాలధారులకు గుమ్మడపు సీతయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి సుగుణ వారి కుమారులు ఉపేందర్ రావు, పద్మజలు కార్తీక సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రామ్మూర్తి, సభ్యులు చంటి, దంతాల నాగయ్య, కొక్కు లక్ష్మీనారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, అమృతరెడ్డి, నర్సయ్య, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

మునగాలలో..

మునగాల : మండల కేంద్రం శివారులో గల శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో సోమవారం అన్నదానం నిర్వహించారు. అన్నదానానికి ఎలక శ్రీనివాసరెడ్డి -రజిత దంపతులు, చింతకాయల శ్రీను -దుర్గ, దేవినేని రాము దంపతులతో పాటు వంగవేటి ధనమ్మ సహకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. గురుస్వాములు పాల్గొన్నారు.

దళితులను మోసం చేసిన కేసీఆర్

- హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్ : దళిత ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : దళితులను మోసం చేసిన కేసీఆర్‌కు సీఎం పదవిలో కొనసాగే అర్హత లేదని, కేసీఆర్‌ను గద్దె దించాలని హుజూర్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి దళిత ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దళితుడిని సీఎం చేస్తానన్న కేసీఆర్ తన మంత్రివర్గంలో దళితులకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదన్నారు. దళితులకు మూడెకరాలు అని చెప్పి ఒక సెంటు భూమి ఇవ్వకుండా పదేళ్లుగా మోసం చేస్తున్నాడని ఆరోపించారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి ఊరుకో ఉద్యోగం కూడా ఇవ్వలేదని, రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో దళిత యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇళ్లు లేని దళిత కుటుంబాలకు 100 గజాల ఇంటి స్థలం, ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర బడ్జెట్‌లో 16 శాతం నిధులు కేటాయించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. దళిత మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వబోతున్నామని, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రస్తుత పాలకులు గత నాలుగేళ్లుగా అక్రమంగా దోచుకోవడమే కాకుండా దళితులను పోలీస్ స్టేషన్‌లో పెట్టి కొట్టించారని ఆరోపించారు. ఇవన్నీ దళితులు గుర్తు పెట్టుకుని ఓటు వేయాలని తెలిపారు. రామస్వామి గుట్ట వద్ద రూ.200 కోట్లతో 4 వేల మంది నిరుపేదలకు 2వేల ఇండ్లు, 2 వేల ఇండ్ల స్థలాలు ఇవ్వాలని మొదలుపెట్టి 80 శాతం కడితే ఈ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా వాటిని పూర్తి చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 6 నెలల్లో ఇండ్లు ఇస్తామని, దళితులకు, నిరుపేదలకు ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. తొలుత వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కల నాగరాజు, బచ్చలకూరి బాబు, జెడ్పీటీసీ రాపోలు నరసయ్య, కౌన్సిలర్ కస్తాల శ్రవణ్, మాజీ జెడ్పీటీసీ గల్లా వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ గొట్టెముక్కల నిర్మల, నాయకులు బెంజిమెన్, జ్ఞానయ్య, రాములు, దయాకర్, యోహన్, నాగేశ్వరరావు, సావిత్రి పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

గరిడేపల్లి : రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని నల్లగొండ ఎంపీ, హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గానుగబండ, కొండాయిగూడెం కల్మలచెరువు గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయబోతుందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఏకపక్షంగా మద్దతు పలుకుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజలందరికీ అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తిలకం దిద్ది స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, ఆదెర్ల శ్రీనివాస్, ఎంపీటీసీ పరమేష్, జయమ్మ, వెంకట్‌రెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, కడియాల అప్పయ్య, బచ్చలకూరి కృష్ణ, కందుల కోటిరెడ్డి, ప్రతాపరెడ్డి, చెన్నారెడ్డి, నాగిరెడ్డి, గోవింద్, సర్పంచ్ విజయ, సీతారాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మలిదశ ఉద్యమకారులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారులు పిండిప్రోలు కోటేశ్వరరావు, శీలం వీరయ్య, తదితరులు సోమవారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో నాయకుడు గెల్లి రవి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. జక్కుల మల్లయ్య, యడ్ల విజయ్, బచ్చలికూరి బాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పద్మశాలి, రజక సంఘాల జిల్లా అధ్యక్షులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు గోవింద్‌రావు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పారేల్లి నర్సింహారావు వారి అనుచరులు ఎంపీ ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ కోతి సంపత్‌రెడ్డి, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు



హుజూర్‌నగర్ : మలిదశ ఉద్యమకారులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఉత్తమ్

వికలాంగులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి

హుజూర్‌నగర్ : ఆసరా పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం వికలాంగులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని పట్టణ వికలాంగుల సంక్షేమ సంఘం గౌరవ సలహాదారులు ఎ.రాము కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక పోస్ట్ మాస్టర్ ఖాజామియాకు వినతిపత్రం అందజేశారు.

గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం



మోతె : ఉర్లుగొండలో హమాలీలకు గ్యారంటీ పథకాలను వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోతె : మండలంలోని గోపతండా, నేరడవాయి, ఉర్లుగొండ, బుర్కచర్ల, కరక్కాయలగూడెం, హుస్సేన్‌బాద్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, ఎంపీపీ ముప్పాని ఆశాశ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ పుల్లారావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుర్వారెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసుదన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాతృనాయక్, సర్పంచ్ అనిత వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ అరుణమ్మ, పీరన్న, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

గరిడేపల్లి : ప్రజలు బీఆర్‌ఎస్‌ను నమ్మే పరిస్థితిలో లేరని టీపీసీసీ అధికార ప్రతినిధి కటికం ఆశారమేష్ అన్నారు. సోమవారం మండలంలోని పొనుగోడు గ్రామంలో ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ బత్తిని రాంబాబుగౌడ్, నేలపట్ల వెంకటేశ్వర్లు, మచ్చ హుస్సేన్, నక్క వెంకన్న, నరేష్, మనోజు, మైసయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు 'గ్యారంటీ'లపై కాంగ్రెస్ ప్రచారం

నడిగూడెం : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో..

మునగాల : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఆరు గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తుందని, ఇందుకోసం ప్రతిఒక్కరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నలమాద పద్మావతికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నలమాద మల్సూర్, షేక్ గౌస్ కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలోని జగన్నాథపురంలో ప్రచారం నిర్వహించి, ఆరు గ్యారంటీ పథకాల గురించి ఓటర్లకు వివరించారు.

మల్లయ్యయాదవ్‌ను గెలిపించాలని ప్రచారం

నడిగూడెం : అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్‌ను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, మాజీ జెడ్పీటీసీ మార్తి ఉపేందర్, పార్టీ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బడేటి చంద్రయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నడిగూడెంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ జ్యోతి, బీఆర్‌ఎస్ నాయకులు

కూచిపూడిలో..

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని కూచిపూడి గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేష్, ఎంపీటీసీ శంకరశెట్టి కోటేశ్వరరావు, అబ్దుల్ నబీ, చాప నాగేశ్వరరావు, బాబురావు, కాసాని వెంకటేశ్వర్లు, చంద్రయ్య, గోపాలరావు తదితరులు ఉన్నారు.

ఆశీర్వదించి.. అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

- కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి



చిలుకూరు : పోలేనిగూడెంలో ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి



చిలుకూరు : జానకీనగర్‌లో పద్మావతికి మద్దతు తెలుపుతున్న జేఏసీ నాయకుడు శ్రీహరినాయక్

చిలుకూరు : కోదాడ అసెంబ్లీ సెగ్మెంట్‌లో సీపీఐ పార్టీ బలపరిచిన తనను ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. సోమవారం మండలంలోని పోలేనిగూడెం, ఆచార్యులగూడెం, బేతవోలు, జెర్రిపోతులగూడెం, కొండాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీమ్‌లను అమలు చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో అవినీతి బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పింగ్రాతి హనుమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీపీఐ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓయూ జేఏసీ నాయకుడి మద్దతు

చిలుకూరు : కోదాడలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు తన వంతు కృషి చేస్తానని ఉస్మానియా విశ్వవిద్యాలయం జేఏసీ నాయకుడు, జానకీనగర్ గ్రామానికి చెందిన భట్టు శ్రీహరినాయక్ అన్నారు. సోమవారం జానకీనగర్‌లో పద్మావతి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని ఆమెకు మద్దతు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు.

ప్రజా సంక్షేమానికి ఆరు 'గ్యారంటీ'లు

అనంతగిరి : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ప్రజల ముందుకు వచ్చిందని పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గోండ్రియాల, కొత్తగూడెం, లకారం, బొజ్జగూడెంతండా, శాంతినగర్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట బుర్ర పుల్లారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు బాబురావు, మందపల్లి వెంకటేశ్వర్లు, నెల్లూరి వెంకటప్పయ్య, చుంచు మురళి, నెల్లూరి వినయ్, నెల్లూరి ప్రభాకర్, యడ్లపల్లి శ్రీను, వెంకటేశ్వరావు, కిలారు తిరుమలరావు, వెంకటమ్మ, శ్రీనివాసరెడ్డి, శాసయ్య, రాధాకృష్ణ, రవి, మధు, కనకయ్య, త్రినాథ్, నర్సింహరెడ్డి తదితరులు

కొమరబండలో కాంగ్రెస్ ప్రచారం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో మాజీ సర్పంచ్ సంపెట రవిగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతిరెడ్డిని గెలిపించాలని కోరుతు సోమవారం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోతో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని వివరించారు. తొమ్మిదిన్నరేళ్ల దొరల పాలన నుంచి విముక్తి కలగాలంటే బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించాలని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



చిలుకూరు : చెన్నారిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అనంతగిరి : గోండ్రియాలలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజా సమస్యలపై సీపీఎం సమరశీల పోరాటాలు

మఠంపల్లి : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిత్యం సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నామని, అసెంబ్లీ ఎన్నికల్లో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి కోరారు. సోమవారం మండలంలోని హనుమంతులగూడెం, యాతవాకిళ్ల, భీల్యానాయక్‌తండా, కామంచికుంటతండా, మఠంపల్లి, చౌటపల్లి, దొనబండతండాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. హనుమంతులగూడెంలో తాపీ వర్కర్లతో కలిసి తాపీ పని చేసి అలరించారు. చౌటపల్లిలో ప్రజానాట్యమండలి కళాకారులతో ఆడిపాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కోట గోపి, ఏకలక్ష్మి, పాండు, పల్లె వెంకటరెడ్డి, రజిత, మండల కార్యదర్శి బాలు, జగన్‌మోహన్‌రెడ్డి, రన్‌మియా, హుస్సేన్, భద్రారెడ్డి, సైదిరెడ్డి, కోటయ్య, రాము, శంభయ్య, కళాకారులు సురేష్, నాగసైదులు, మట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలన తెలంగాణకు శ్రీరామరక్ష

- కోదాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్



మునగాల : గణపవరంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బొల్లం మల్లయ్య యాదవ్

మునగాల : సీఎం కేసీఆర్ పాలన తెలంగాణకు శ్రీరామరక్ష అని కోదాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కొక్కిరేణి, తిమ్మారెడ్డిగూడెం, గణపవరం, ముకుందాపురం, ఆకుపాముల, నరసింహాపురం, కోదండరామాపురం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయనకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. మహిళలు మల్లయ్యయాదవ్‌కు తిలకం దిద్ది, మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. ఎన్నికలు రాగానే సంక్రాంతికి గంగిరెద్దు వాళ్ల వచ్చినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు వస్తున్నారని ఎద్దేవా చేశారు. నిరుపేదల సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ రావాలన్నారు. బీఆర్‌ఎస్ గెలుపు కోసం గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సుంకర అజయ్‌కుమార్, కట్ట సతీష్, పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

కోదాడఅర్బన్ : కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని కోదాడ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం ఉదయం కోదాడ బస్టాండ్ వద్ద బీఆర్‌ఎస్ కార్మిక విభాగం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే నయీం ఆధ్వర్యంలో వివిధ వర్గాల కార్మికులను మల్లయ్యయాదవ్ కలిసి వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఎన్నికల కోసమే వచ్చే ఇతర పార్టీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. సమావేశంలో కాజా మోయినుద్దీన్ షాకీర్, లింగయ్య, కార్మికులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే పట్టణాభివృద్ధి సాధ్యం

కోదాడ : కోదాడ పట్టణాభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కోదాడ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం కోదాడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో కోదాడ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ తెప్పని శ్రీనివాస్, 14వ వార్డు మాజీ కౌన్సిలర్ జమ్ముల లావణ్యప్రసాద్ ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలుగా కోదాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, ఎన్నికల అనంతరం అసంపూర్తిగా ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోదాడ : గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడఅర్బన్ : కోదాడ బస్టాండ్ వద్ద కార్మికులతో మాట్లాడుతున్న బొల్లం మల్లయ్యయాదవ్

తాత్కాలిక బిల్ కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : మండలంలోని సోమారం గ్రామ పంచాయతీ తాత్కాలిక బిల్ కలెక్టర్ ఓ రాజకీయ పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిల్ కలెక్టర్ గ్రామంలోని పలు ఇళ్లకు వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయవద్దని, ఓటు వేస్తే మీకు పెన్షన్ బంద్ అవుతుందని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే దళితబంధు కూడా రాదని హెచ్చరికలు జారీ చేస్తున్నాడని తెలిపారు. తాత్కాలిక బిల్ కలెక్టర్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బిల్ కలెక్టర్‌కు కూడా రికార్డులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీ మండల కార్యదర్శి ఎల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఉదర వెంకన్న, ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు రేఖ ఉపేందర్ ఉన్నారు.

శివాలయాల్లో కార్తీకమాస పూజలు



కోదాడఅర్బన్ : అమరలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



మేళ్లచెరువు : శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మేళ్లచెరువు : కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయానికి తెల్లవారుజామున 4 గంటలకే భక్తులు తరలివచ్చి దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయంలో విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ, ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయన మేనేజర్ కొండారెడ్డి, అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, భక్తులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడు ప్రత్యేక పూజలు

టీటీడీ పాలక మండలి సభ్యుడు సాముల రాంరెడ్డి సోమవారం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం చేశారు. ఈఓ కొండారెడ్డి, వట్రా వెంకటరెడ్డిలు ఆయనను పూలమాల, శాలువాతో సత్కరించారు.



నేరేడుచర్ల : శివుడికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

నేరేడుచర్ల : కార్తీక సోమవారం సందర్భంగా మండల కేంద్రంలోని శివాలయానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి, దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి ఉగ్రదండి శివప్రసాద్‌శర్మ వేద మంత్రాలతో స్వామివారికి అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



నేరేడుచర్ల : శివాలయంలో..

హరిహర క్షేత్రంలో..

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరంలో గల హరిహర క్షేత్రంలో సోమవారం కార్తీక తొలి సోమవారం సందర్భంగా శివుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు స్వామివారికి అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నడిగూడెం : రత్నవరంలోని హరిహర క్షేత్రంలో..

పరమశివుడికి అభిషేకం

కోదాడఅర్బన్ : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగ సహిత పార్వతీఅమరలింగేశ్వరస్వామికి వేకువ జాము నుంచే ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, విశేష అలంకరణ తదనంతరం స్వామివారికి మహర్నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి, భక్తులు పాల్గొన్నారు.